# శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు

శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మొట్ట మొదటి స్పీకరుగా 1956వ సంవత్సరం డిసెంబరు 4వ తేదీన ఏకగ్రీవంగా ఎన్నికై 1962వ సంవత్సరం ఫిబ్రవరి 26వ తేదీ వరకు ఆ పదవిని నిర్వహించారు. వీరి హయాంలో మొట్ట మొదటి సారిగా 1960వ సంవత్సరములో అఖిల భారత స్పీకర్ల సదస్సు హైద్రాబాదులో జరిగింది.

శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు 1881వ సంవత్సరం జనవరి 22వ తేదీన కృష్ణా జిల్లా నందిగామలో శ్రీ లక్ష్మయ్య, శ్రీమతి వరలక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. వీరు బందరులో ఎఫ్.ఎ., బి.ఎ. చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. మద్రాసు విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో పట్టభద్రులై 1906వ సంవత్సరములో కొంతకాలం పాటు న్యాయవాదిగా పనిచేశారు.

మహాత్మాగాంధీ ఇచ్చిన పిలుపుతో న్యాయవాద వృత్తిని వదలి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఆంధ్రులలో శ్రీ కాళేశ్వరరావు ప్రముఖులు. శ్రీ కాళేశ్వరరావు 1922-1947 మధ్యకాలంలో స్వదేశీ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం తదితర ఉద్యమాలలో పాల్గొన్నందుకు గాను రాజమండ్రి, తిరుచినాపల్లి, కడలూరు, నెల్లూరు, నాగపూరు తదితర జైళ్లలో కఠిన కారాగార శిక్ష అనుభవించారు.

శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు 1937-1939, 1946-1951 సంవత్సరాల మధ్య కాలంలో రెండుసార్లు ఉమ్మడి మద్రాసు శాసనసభ్యునిగా ఎన్నికైనారు.

వీరు కేంద్ర సహకార బ్యాంకు స్థాపనకు నిర్విరామ కృషి చేసారు. విజయవాడ పురపాలక సంఘం అధ్యక్షునిగా ఎన్నికై మంచినీరు, మురుగునీటి పారుదల, గ్రంథాలయాల ఏర్పాటు, వంతెనల నిర్మాణం మొదలైన అభివృద్ధి పనులను చేపట్టారు. గ్రంథాలయోద్యమంలో భాగంగా విజ్ఞాన చంద్రికమండలి ఏర్పాటులో శ్రీ అయ్యదేవర ప్రముఖ పాత్ర వహించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ సెనేట్ సభ్యునిగా, విజయవాడ నేషనల్ ఎడ్యుకేషన్ కమిటీ అధ్యక్షునిగా వీరు ఎనలేని సేవలు అందించారు.

శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు మంచి రచయిత. వేదాంతం, చరిత్ర, రాజకీయ విషయాల నేపథ్యంపై అనేక రచనలు చేశారు. జైలు శిక్షను అనుభవిస్తూ చైనా జాతీయోద్యమ చరిత్ర, ఈజిప్టు చరిత్ర, ఫ్రెంచి విప్లవ చరిత్ర, అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్రపై పుస్తకాలు రాసారు. ఆయన రాసిన 'నా జీవిత కథ' ఆనాటి ఆంధ్రోద్యమ గాథకు అద్దం పడుతుంది.

శ్రీ కాళేశ్వరరావు 1955వ సంవత్సరం రెండవ శాసనసభ సభ్యునిగా విజయవాడ దక్షిణ నియోజకవర్గం నుండి ఎన్నికైనారు. వీరు 1962వ సంవత్సరములో జరిగిన శాసనసభ ఎన్నికలలో విజయవాడ దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేసి తన విజయం గురించిన వార్త వినకుండానే 1962వ సంవత్సరము ఫిబ్రవరి 26వ తేదీన మరణించారు.

సభాపతిగా శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు సభానిర్వహణలో ఆదర్శవంతమైన సంప్రదాయాలకు బాట వేశారు. 1959, డిసెంబరు 14వ తేదీన శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు ఇచ్చిన రూలింగులో - 98 శాతం సభ్యులకు అర్థమయ్యే విధంగా శాసనసభా కార్యక్రమాలను తెలుగులోనే నిర్వహించకుంటే బాగుంటుంది. శాసనసభలో మన దేశంలో మాట్లాడే 14 భాషలలో మాట్లాడినా నాకేమీ అభ్యంతరం లేదు కాని, అవి అందరికి అర్థం కాకపోతే ప్రయోజనం ఏమి ఉండదు. రాష్ట్రంలో అందరికీ తెలిసిన భాష తెలుగు. ఉర్దూ భాష తెలిసిన వారు కొన్ని లక్షలలో ఉంటారు. కావున ఈ రెండు భాషలను ప్రధాన భాషలుగా పరిగణిస్తున్నాం. ఇది సంప్రదాయంగా వస్తున్నది - అని పేర్కొనడం ద్వారా శాసనసభా కార్యకలాపాలు అందరికీ అర్థమయ్యే విధంగా తెలుగులోనే నిర్వహించుకోవాలని స్పష్టం చేశారు. ఆ విధంగా శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు తెలుగు భాష ప్రాధాన్యతను, ఆ భాష పట్ల ఆయనకు గల అభిమానాన్ని, ఇతర భాషల పట్ల ఆయనకు గల గౌరవాన్ని చాటి చెప్పారు.

సభాపతి అనుమతి లేకుండా సభ్యులైనా, మంత్రులైనా, సభలో ఎటువంటి ప్రసంగాలను గాని, ప్రకటనలను గాని చెయ్యరాదని, వాటి ప్రతులను సభలో పంపిణీ చేయరాదని 1961, ఆగస్టు 11వ తేదీన స్పష్టమైన రూలింగు ఇచ్చారు. కొన్ని సందర్భాలలో సభాపతిని ఛాంబర్‌లో కలిసి వారు చేయదలచుకున్నట్టి ప్రకటన / ప్రసంగాల ప్రతులను

ఆయనకు చూపి ఆయన అనుమతి మేరకే సభలో అట్టి ప్రకటనలను/ ప్రసంగాలను చెయ్యాలని, ఆ ప్రకటనలు / ప్రసంగాలను సభలో పూర్తి అయిన తరువాత మాత్రమే వాటిని పత్రికా ప్రతినిధులకు అందజేయాలని ఆయన తన రూలింగులో చాలా స్పష్టంగా పేర్కొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి, నిరాడంబరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, హరిజనోద్యమకర్త, విశాలాంధ్ర మహాసభ స్థాపకుడు, గొప్ప కర్మయోగి అయిన శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు జీవితం నేటి యువతకు, శాసనసభ్యులకు స్ఫూర్తిదాయకమైనది.

## శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు స్పీకరుగా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

సోదర సభ్యులారా, ఈ రోజున అన్ని పార్టీలవారు ఏకగ్రీవంగా ఈ సభకు నన్ను అధ్యక్షునిగా ఎన్నుకొన్నందుకు నేను మీకందరకూ హృదయ పూర్వకంగా కృతజ్ఞతను తెలియజేయుచున్నాను. హృదయము సంతోషముతో నిండినప్పుడు మాటలురావు. మీరు అన్నిపార్టీలవారు, అన్నివర్గాలవారు, స్త్రీలు, పురుషులు, ముసల్మానులు, హరిజనులు, భాష మైనారిటిగా నున్న కర్ణాటకులు, గొప్పవారైన డాక్టర్ మేల్కోటేగారు, మొదలయిన వారంతా నన్ను గురించి అతిశయోక్తిగా చెప్పినటువంటి మాటలకు నేను ఏమి జవాబుచెప్పాలో తోచుటలేదు. నేను విద్యార్థిదశలో ఉండగా రాజారామ మోహన్‌రాయ్, స్వామి వివేకానంద మొదలైనవారి గ్రంథాలు చదువుటవలన నాకు దేశసేవచేయాలనే బుద్ధి పుట్టింది. అంతేకాక కందుకూరి వీరేశలింగం, వెంకటరత్నం నాయుడుగార్ల యొక్క సాహచర్యము, శిష్యత్వములవల్ల ఏదో కొంతసేవ చేయాలనిపించింది. ఇంతలో కాంగ్రెసు వచ్చినది. నేను Law College లో చదువుకొనుచుండగానే బెంగాల్ విభజనోద్యమం ప్రచండంగా సాగింది. విద్యార్థుల తరపున మేము పెద్ద సభచేశాము. విద్యార్థి ఉద్యమంతోనే నా జీవితం ప్రారంభమైంది. "Congratulations to young Bengal", స్వదేశీ ఉద్యమం, మొదలయిన వాటిలో పాల్గొన్నాను. లాల్, బాల్, పాల్‌గార్లకు మేమంతా శిష్యులము. తరువాత మహాత్మాగాంధీగారు వచ్చారు. మళ్లా వెనుకకు పోకుండా అప్పటినుంచి ఉడతా భక్తితో దేశస్వాతంత్ర్యంకొరకు, ఆంధ్రరాష్ట్రంకొరకు, తరువాత విశాలాంధ్రకొరకు నేను సేవచేసిన మాట వాస్తవమే. కాని, ఇతర విషయాలలో నేను సేవచేసినందుకు నాకు ఈ పదవి ఇవ్వడం న్యాయంకాదు. దీనిని నిర్వహించుటకు తగు సమర్థత, అర్హత మున్నగు విషయాలు చాలా ఉన్నాయి. ఇది ఎట్లా ఉన్నా విశాలాంధ్ర రావడమనేది నాకోసం నేను చేసుకున్న పనికాదు. నాకోసమే విశాలాంధ్ర నిర్మాణోద్యమంలో నేను పాటుపడలేదు. మంత్రి పదవి దొరకుతుందనే దృష్టితో స్వరాజ్యంకోసం పాటుపడలేదు. ఏమైనప్పటికిన్నీ ఆంధ్రప్రదేశ్ పేరుతో విశాలాంధ్ర ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ప్రథమ అధ్యక్షునిగా నేను ఎన్నుకోబడినందువల్ల నా జీవితం ధన్యమైనది. మీరంతా నాకు అఖండమైన గౌరవము

కలుగజేశారు. ఇందుకు కాంగ్రెసుపార్టీ నాయకులైన శ్రీ సంజీవరెడ్డిగారికి, ఇతరమంత్రులకు కాంగ్రెసుపార్టీవారికి నేను ముఖ్యంగా కృతజ్ఞతను తెలపవలసియున్నది. ప్రతిపక్షంవారు కూడా వేరే పోటీపెట్టకుండా అధ్యక్షునిగా నన్నే ప్రేమతో అంగీకరించారు. కమ్యూనిస్టుపార్టీవారూ నేనూ అనేకసార్లు పోట్లాడేవారము. అనేక వాగ్యుద్ధాలు చేశాము. నేను అందులోవారికి Enemy No. 1 క్రింద లెక్క. 43-44-45 సం॥లలో మహాత్మాగాంధీ దగ్గరకు పోవడం, P.C. Joshi గారికి, నాకూ జరిగిన వివాదాలూ, ఎలక్షనులలో జరిగిన పోటీలు ఇటువంటివన్నీ మీకు తెలుసును. 46వ సంవత్సరంలోనూ, 50వ సంవత్సరంలోనూ ఎన్నికల యుద్ధాలుజరిగాయి. ఇప్పుడు వాళ్లూ, మనం చాలా దగ్గరకు వచ్చాము. కృశ్చేవ్ బుల్గానిన్ మున్నగువారు మన దేశం రావడంవల్ల వారి దేశంలో కూడా కొంత మార్పు కలిగింది. అంతర్జాతీయ పరిస్థితులవల్ల వారు మనకు దగ్గరగా రావడమే కాకుండా మన అంతర్జాతీయ పాలసీలోని రాజనీతిని, మన నెహ్రూయొక్క రాజనీతిని కమ్యూనిస్టు పార్టీవారు సమర్థిస్తున్నారు. దేశస్వాతంత్ర్యం విషయం లోనూ, ఈజిప్టు విషయం, మున్నగు విషయాలలోనూ కూడా మనలను కమ్యూనిస్టుపార్టీవారు సమర్థిస్తున్నారు.

మనము సోషలిస్టిక్ పేట్రన్ ఆఫ్ సొసైటీ (Law) స్థాపనకు దగ్గరగా వస్తున్నాము. సోషలిస్టిక్ సొసైటీ (Socialistic Society) స్థాపనమేకదా కమ్యూనిస్టుల ఉద్దేశ్యం? డిక్టేటర్‌షిప్ ఆఫ్ ది ప్రోలెటేరియట్ (Dictatorship of the Proletarait) అయిన తరువాత క్లాస్‌లెస్ సొసైటి (Classless Society)ని స్థాపించడమే వారి ఉద్దేశ్యం. క్లాస్‌లెస్ సొసైటి (Classless Society) స్థాపనమే మనము కూడా ఉద్దేశించాము. కాని, మనపద్ధతులు గాంధేయ పద్ధతులు. వారివి టోటలిటేరియన్ (Totalitarian)పద్ధతులు. మన పద్ధతులకు వారి పద్ధతులకు భేదము ఉన్నది. అయినప్పటికీ, ఆదర్శములు ఒకటిగా ఉండవచ్చును. అంతేకాక, విశాలాంధ్ర విషయములో మేమంతా కలిసి పనిచేశాము. విశాలాంధ్ర విషయములో ఆంధ్ర ప్రభుత్వము ప్రకాశం ప్రభుత్వము ఇతర ప్రభుత్వముల మద్దతు మాకు లేనప్పుడు ఏకగ్రీవముగా గట్టిగా సాయపడింది శ్రీ ప్రకాశం. శ్రీ ప్రకాశం క్రింద పనిచేసిన శ్రీ సంజీవరెడ్డి మొదలయినవారంతా మా కన్వెన్షన్సు (Conventions)కు వచ్చారు. మొట్టమొదటనే వారి ఆశీర్వచనములు మాకు ఉన్నవి. 49వ సంవత్సరం నవంబరు 16వ తేదీన విశాలాంధ్ర మహాసభ స్థాపింపబడినప్పుడు వారి ఆశీర్వచనములు వచ్చినవి. 1950 వ సంవత్సరములో వరంగల్లులో జరిగిన కన్వెన్షన్స్‌కు వారు దయచేశారు.

అప్పటినుంచి ఆంధ్ర రాష్ట్రములో మాత్రము ఏకగ్రీవముగా ఎట్టి అభిప్రాయ భేదములేకుండా వచ్చినది అయితే, తెలంగాణాలో మాత్రము కొంచెము అభిప్రాయ భేదము ఉన్నమాట నిజమే. కాని ఒక్క మాట మాత్రము చెప్పకతప్పదు. కమ్యూనిస్టు పార్టీవారు తెలంగాణాలోను, ఆంధ్ర రాష్ట్రములో కూడా విశాలాంధ్ర విషయములో ఏకాభిప్రాయముతో ఉన్నారు. ఆఖరు రోజులలో ఆంధ్రదేశము మేల్కొలేదు. వారిదగ్గర నుంచి టెలిగ్రాములు రాలేదేమి; హర్తాళులు జరగలేదేమి; అని మాకు ఢిల్లీనుంచి ఒక సందేశం వచ్చింది. వెంటనే ఎనిమిదివేల టెలిగ్రాములు పంపాము, మూడువందల హర్తాళులు చేశాము. ఈ విషయములలో కమ్యూనిస్టు పార్టీవారు నాతో చాలా సహకరించి, కూడా ఉండి ప్రతిచోటా పనిచేశారు. బహుజాగ్రత్తగా ఏ విధమైనటువంటి వైలెన్సు (Violence) లేకుండా ఉద్యమము జరుపబట్టే మనకు విశాలాంధ్ర వచ్చింది.

సోషలిస్టుపార్టీవారు, యు.పి.పి.వారు కూడా నన్ను అభినందించారు. శ్రీరామకృష్ణరాజు అభినందించారు. ఆయన ఆంధ్రదేశంలో పేరెన్నికగన్న నాయకులు. వారు, నేను ఎప్పటినుంచో సహచరులుగా ఉన్నాము. ఆయన సంగీత సాహిత్యములు రెండింటిలో కూడా సమాన ప్రతిభగలవారు.

నాట్యము విషయం వదలిపెట్టమన్నారు శ్రీ వెంకట్రావుగారు. శ్రీ రామకృష్ణరాజుగారి యొక్క అభినందనలు నాకు మిక్కిలి విలువగలవని మనవిచేస్తున్నాను. శ్రీ రంగారెడ్డిగారు నన్నభినందించారు. తెలంగాణాలో ఎవరికయినా ఒక వ్యక్తికి గొప్ప ప్రతిష్ట ఉన్నదంటే అది నిజముగా రంగారెడ్డిగారికే. మేము కొన్ని విషయాలలో వ్యతిరేకించుకున్నాము, పోట్లాడుకున్నాము. తిరిగి కలిశాము. నేను కూడా పోయి వారిని బ్రతిమిలాడాను. వారు అంగీకరించారు, చక్కగావచ్చారు, మనకీనాడు నాయకత్వంవహించారు. ఇదొక గొప్ప సంగతి. అన్నిటికన్న గొప్ప విషయము మన ఆంధ్రకేసరి యొక్క ఆశీర్వచనములు. ఆయన ఓపికతోలేచి అంతసేపు మాట్లాడి ఆశీర్వదించారు. దీవెనలు భగవంతుడేయిస్తాడు. అయితే ఇటువంటి పెద్దలయొక్క, ధీరులయొక్క, దేశనాయకులయొక్క ఉత్తమ పురుషుల యొక్క ఆశీర్వచనములు భగవదాశీర్వచనముల తరువాత అంత ముఖ్యమయినవి. వారి క్రింద నేను అనేక సంవత్సరములుగా పనిచేశాను. వారు ఎన్ని సంవత్సరములు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ అధ్యక్షులుగా ఉన్నారో నేను అన్ని సంవత్సరములు ఆంధ్రరాష్ట్రకాంగ్రెసు కమిటీకి జనరల్ సెక్రటరీగా ఉన్నాను. మేమిద్దరము

ఎన్నో సంవత్సరములు కలిసి పనిచేశాము. సంఘ సంస్కరణల విషయములో కూడ కలిసి పనిచేశాము. వారు ఇంగ్లండు నుంచి 1907వ సంవత్సరంలో వచ్చినప్పుడు వారితో కలిసి భోజనంచేశామని మమ్ములను వెలివేశారు. అయితే, మేము లెక్కలేదు, పొమ్మన్నాము. అన్నిటిలో కూడ వారు మనలను నడిపినటువంటివారు. వారియొక్క దీవెనలు, అభినందనలు, ఆశీర్వచనములు చాలా ముఖ్యమయినటువంటివి.

శ్రీ గోపాలరెడ్డిగారు చెప్పినట్లు ఏదో భాషాసేవకూడా కొంత నేను చేసినమాట వాస్తవమే. 1907వ సంవత్సరములో విజ్ఞాన చంద్రికామండలి పెట్టాము. ఎప్పుడైతే స్వరాజ్యము కావలెనని అన్నామో దానితోబాటు సంఘసంస్కరణ తప్పదు; దానితోబాటు హరిజనోద్ధరణ తప్పదు. కోట్లకొలది జనులను ప్రత్యేకముగా వుంచితే ఎట్టి స్వరాజ్యం వస్తుంది; ఎట్లా వస్తుంది; వస్తే ఎట్లా నిలుస్తుంది; అనేటటువంటిది అప్పుడుకూడా అనుకున్నటువంటిదే. అందువల్ల నేను నా మిత్రులు శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారు మొదలయినవారంతా కలసి నవీన విజ్ఞానాన్ని ఆంధ్రప్రజానీకానికి అందిద్దామని ప్రయత్నం చేశాము. నేను కూడా ఉడతా భక్తితో కొద్దిగా వ్రాశాను. జైళ్ళలో కూర్చొని వ్రాసుకుంటూ ఉండేవారము. నేనూ, గోపాలరెడ్డిగారు కూర్చొని చదువుకుంటూ వుండేవారము. ప్రపంచములోని కాన్‌స్టిట్యూషన్సును చదివాము. ఇంగ్లాండ్, డొమినయన్స్, యూరపు దేశాలు మొదలయిన వాటికి సంబంధించిన కాన్‌స్టిట్యూషన్స్‌ను, టోటలిటేరియన్ దేశాలయొక్క కాన్‌స్టిట్యూషన్స్‌ను చదివాము. ఏదో కొంత కృషి చేశాము. అది అంతా అయిపోయింది. చివరకు ఈ పదవీ సన్యాసాశ్రమంలో వచ్చిందని శ్రీ గోపాలరెడ్డిగారు చెప్పారు. నేను ఒప్పుకుంటున్నాను. బహుశః సన్యాసాశ్రమం కాకుండా వానప్రస్తాశ్రమమేమో ఇది. మొత్తమునకు అటువంటిదే ఇది. సందేహం లేదు. నోటికి తాళం వేసుకోవలసి వచ్చింది. నాకు ఎప్పుడూ స్వతంత్రంగా ఉండడం అలవాటు. పార్టీలోకూడా స్వతంత్రంగా ఉంటూ ఉండేటటువంటి పద్ధతే నాది. మినిమమ్ డిసిప్లిన్ (Minimum Discipline) నాది. (నవ్వు) మత ధర్మముగా నేను ఇవన్నీ నిర్వర్తించాను. స్వరాజ్యం వస్తుందని దిగామా ఉద్యమంలోకి? నేను స్వరాజ్యం చూడనేమో, తరువాత ఆంధ్రరాష్ట్రం చూడనేమో అనుకున్నాను. చూడకుండానే శ్రీ వెంకటప్పయ్యగారు పోయినారు. విశాలాంధ్రము కూడా నాకు మత ధర్మమే. అందువల్ల కొందరు వ్యతిరేకించినారని నాకు భయము లేదు. మనము చేతనయినంతా చేస్తాము. వదలి పెట్టి పోతాము. ఇతరులెవరో దానిని సాగిస్తారు.

కాని, ఈ అదృష్ట మేమిటంటే ఈ మూడు విషయాలు మనం చూశాము. నేను బ్రతికి వుండి విశాలాంధ్ర చూడడం, స్థాపించడం, తరువాత మీరంతా కలసి నన్ను తీసుకుని వచ్చి ఈ కుర్చీమీద కూర్చో పెట్టడం, ఇదంతా కూడ నాకు చాలా గొప్ప విషయం. నా జన్మ ధన్యమయింది. ఈ అత్మకు ముసలితనం లేదు. అది నా నమ్మకం, అత్మకు ముసలి తనమూ లేదు. మరణము లేదు. అందువల్ల ఈ శరీరము కృశించి పోయినప్పటికి మనస్సు నిరుత్సాహపడటం తప్పు. ఎప్పుడూ కూడా కొత్త విషయాలు మనం గ్రహించుతూ వుండాలి. ఇది నా నమ్మకములలో మరొకటి. రిసెప్టివ్ మైండ్ (Receiptive mind) తో ఉండాలి. ఓపెన్ మైండ్ (Open mind) తో ఉండాలి. వెనుకబడి ఎక్కడో ఒకచోట ఫుల్‌స్టాప్ పెట్టుకొని ఉండకూడదు. ఇది కూడా నా నమ్మకం. గ్లాడ్‌స్టన్ దగ్గరనుంచీ నేను నేర్చుకున్నది స్టూడెంట్ ఇన్ లైఫ్ (Student in life) అనే విషయం. ఎప్పుడూ నేను పుస్తకాలు చదువుతూనే వుంటాను. నాకది అలవాటు. ఇందుకు భగవంతుడు నాకు శక్తి ఇచ్చుగాక అని కోరుతున్నాను.

ఇక నా పార్లమెంటరీ జీవితం విషయం ఉన్నది. 1916వ సంవత్సరం నుంచి కాంగ్రెస్ వారు శాసనసభలకు అభ్యర్థులను నిలిపినప్పుడల్లా నన్ను నిలుపుతూనే వచ్చారు. 1916లో పార్లమెంటరీ యాక్టివిటీస్‌తో సంబంధం పెట్టుకున్నప్పుడు నన్ను మద్రాసు కౌన్సిలుకు నిలబెట్టారు. తిరిగి 1937లో నన్ను మద్రాస్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి నెలబెట్టారు. అప్పుడు మంత్రిపదవి ఇవ్వటానికి వీలులేక రాజగోపాలాచారిగారు చీఫ్ పార్లమెంటరీ సెక్రటరీగా నాకు చాలా తరిఫీదు ఇచ్చారు. ఆ సమయంలో నా మిత్రులు అయినటువంటి హిందూ పత్రిక ఎడిటరుగారు స్పీకర్‌షిప్ ఇవ్వండి కాళేశ్వరరావుగారికి అని చెప్పారు. కాని, స్పీకరుషిప్ ఇస్తే పార్లమెంటరీ యాక్టివిటీస్‌నుంచి పోతాడు. అతను స్వాభావికంగా పార్లమెంటేరియన్ కాబట్టి స్పీకర్‌షిప్ ఇవ్వనన్నారు ఆయన. అప్పుడు స్పీకర్‌షిప్ నాకు తేలికగా వచ్చేది. కాని ఆయన ఒప్పుకోలేదు. నేను కూడా సరే అన్నాను. స్పీకర్ షిప్ లేనప్పుడు, మంత్రిపదవి లేనప్పుడు చీఫ్ పార్లమెంటరీ సెక్రటరీగా ఉండి వారి క్రింద చాలా తరిఫీదు పొందాను. శ్రీ గోపాలరెడ్డిగారు అప్పుడు మంత్రిగా ఉన్నారు. అంతాకలసి ఒక కుటుంబముగా పని చేసుకున్న రోజులవి. కాని, ఇప్పుడు ఒప్పుకున్నాను, స్పీకర్ పదవికి, ఏదో పెద్దవాడను అవుతున్నాను పోనీ అని.

మనము ముఖ్యంగా సోషలిస్టిక్ ప్యాట్రన్ ఆఫ్ సొసైటిని నిర్మించు కోవలసి ఉంది. ఆ పనిలో తోడ్పడవచ్చును. భావాలు ఇవ్వవచ్చును. కేవలం యాక్టివ్ ఎలక్షన్ పోలటిక్సులో, కాంగ్రెస్ కమిటీలలో ఉండనక్కరలేదు. కాని, తక్కిన విషయాలలో పాల్గొనవచ్చు. గాంధేయ పద్ధతులలో సోషలిస్టిక్ ఆర్డర్ ఆఫ్ సొసైటి మనకు రావలెనని ప్రయత్నం చేసే విషయంలో కూడా నేను యాక్టివ్ పార్టు తీసుకొనవలెనని నా ఆశ.

ఇక్కడ కూడా సోషలిస్టిక్ ఆర్డర్ ఆఫ్ సొసైటిని మీరు తీసుకుని రావాలి. ఈ శాసనసభ అందుకే. ఆ ఆదర్శంకోసమే మనము శాసనములను సృష్టించుకోవాలి. మంత్రులు అందుకు పనిచేయవలె. శాసనసభ్యులు అందుకు పనిచేయవలె. కాబట్టి మనము ప్రోగ్రెసివ్ లెజిస్లేషన్ చాలా చేసుకొనవలసి ఉంది. దానిలో నేను మీకు తోడ్పడుతాను.

గోపాలరెడ్డిగారు చెప్పినట్లు, ఇంతకుముందు మహామహులంతా సభాధ్యక్షులుగా ఉండినారు. చింతలవాడి నరసింహారావుగారు మొదట అధ్యక్షులుగా ఉండినారు. తరువాత మహర్షి సాంబమూర్తిగారు ఉండినారు. తరువాత శివషణ్ముగం పిళ్ళైగారు ఉండినారు. తరువాత నల్లపాటి వెంకటరామయ్యగారు ఉండినారు. నేను వారి time లో లేననుకోండి. తరువాత రొక్కం లక్ష్మీనరసింహం దొరగారు ఉన్నారు. వైద్యగారిని గురించి కూడ నేను చాలా విన్నాను. వారు సుప్రసిద్ధ న్యాయవాదులు, వారు అనేక సంవత్సరాలనుంచి కాంగ్రెసులో ఉన్నటువంటి వారు, వారు బహుజాగ్రత్తగా బహు గౌరవంగా ఈ హైదరాబాదు శాసనసభను నడిపించారని విన్నాను. వీరందరి తరువాత నేను వచ్చాను. వారియొక్క Traditions, పరంపరానుగతమైన పద్ధతులను నేను కూడ అనుసరిస్తానని వాగ్దానం చేస్తున్నాను. బ్రిటీష్ పార్లమెంటుయొక్క పద్ధతులు చాలా మంచివి. ఎందుకంటే వాళ్ళది Mother of Parliament అని చెప్పబడుతున్నది. వాళ్ళు ఆ పద్ధతినంత బహుజాగ్రత్తగా తీసుకు వచ్చారు. వాళ్ళు సామ్రాజ్య వాదులైనా, వాళ్ళ దేశాన్ని మాత్రం చాల జాగ్రత్తగా democratic గా కాపాడుకొంటూ వచ్చారు. కాబట్టి మనము ఆ విధంగా democratic గా పోవలసియుంటుంది. ఈ కుటుంబానికి నన్ను పెద్దగా ఎన్నుకొన్నారు కనుక సభ్యులందరి యొక్క గౌరవాన్ని, హక్కులను కాపాడటమే నా విధి. అప్పుడప్పుడు అభిప్రాయ భేదాలు ఉంటే ఉండవచ్చు. Freedom of speech, freedom of writing, freedom of press ఇవన్నీ వుంటాయి. వారి వారి అభిప్రాయాల ప్రకారం ఉపన్యాసాలు

ఇచ్చుకోవచ్చు. విమర్శలు చేసుకోవచ్చు. కాని ఏది జరిగినా ఎప్పుడూ సౌజన్యంతో జరగాలి. విమర్శలు చేసుకొన్నా కఠినంగా మాట్లాడకుండా చేసుకోవలసియుంటుంది. అయితే పార్టీ భేదం లేకుండా అందరి హక్కులను సంరక్షించి, హిందూదేశంలో ఒక గౌరవప్రదమైనటువంటి ప్రతిష్టతో కూడినటువంటి శాసనసభను ఈ ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించుకోడానికి నా యొక్క శక్తినంతా వినియోగిస్తానని నేను గట్టిగా మనవి చేస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ వచ్చింది. ఇప్పుడు 3.10 లక్షల ఆంధ్రులతో కూడిన అఖండమైన, అవిచ్ఛిన్నమైన ఆంధ్రప్రదేశము ఏర్పడింది. మొత్తం 3.50 లక్షలుగల ఆంధ్ర ప్రజానీకం బ్రిటిష్ సామ్రాజ్య వాదులచేత అనేక రాష్ట్రాలుగా పంచి పెట్టబడింది. వారినంతా ఇప్పుడు ఏకము చేయడానికి ప్రయత్నం చేస్తున్నాము. ఇప్పుడు 3.10 లక్షల ఆంధ్రులతో కూడిన విశాలాంధ్రను సాధించుకొన్నాము. ఇందాక ప్రకాశంగారు శలవిచ్చినట్లు ఇంకా మనకు రావలసినటువంటి భాగాలు వున్నాయి. ఛాందా జిల్లాలో కొంత భాగము రావలసి యున్నది. అట్లాగే ఇతర రాష్ట్రాలలో నుంచి కొన్ని భాగాలు రావలసి యున్నవి. ప్రభుత్వం వారూ మీరందరూ సామరస్యంగా, negotiations ద్వారా zonal councils ద్వారా శాంతియుతమైనటు వంటి ఆందోళనద్వారా అవన్నీ రాబట్టడానికి ప్రయత్నం చేయవలసి యుంటుంది. నేను మీకు పైన వుండి ఆశీర్వదిస్తూ వుంటాను. దాంట్లో నా సహాయం, నా పలుకుబడి ఏదైనా కావలసియుంటే తప్పక ఆ విధంగా చేస్తాను.

తరువాత, minorities యొక్క వెనుకబడిన ప్రాంతాల యొక్క రక్షణ చాల ముఖ్యమైనటువంటిది. తెలంగాణాలో మనం కలసినామనేది నేను ఒప్పుకొంటున్నాను. విశాలాంధ్ర ఆఖరు రాజధాని హైదరాబాద్. నైజాంముల్ ముల్క్‌కు అఖండమైన అవిచ్ఛిన్నమైన ఆఖరు రాజధాని హైదరాబాదే. తరువాత బ్రిటిష్ సామ్రాజ్య వాదులు దేశాన్ని పంచి పెట్టారు. ఇప్పుడు మనము మరల వెనుకకు పోయి హైదరాబాదు రాజధానికి వచ్చాము. కనుక మనము హైదరాబాదులో చేరాము గాని మనలో వారు చేరిందనేదేమిలేదని నా అభిప్రాయం. కాబట్టి ఇప్పుడు హైదరాబాదు రాజధానిగా వున్నటువంటి ఆంధ్రదేశము ఏర్పడింది. ఇంక తెలంగాణా కొన్ని విషయాలలో వెనుకబడి వున్నదని వారికి కొన్ని safeguards, రక్షణలు ఏర్పాటు చేశారు. ఆ రక్షణలను మనము గట్టిగా నిలబెట్టి అమలు జరుపవలెనని కోరుతున్నాను. తరువాత, ఉర్దు, కన్నడ, మహారాష్ట్ర

ఇవి minority భాషలుగా ఇక్కడ వున్నాయి. మాతృభాషలకు ప్రత్యేకమైన సంరక్షణ ఇవ్వాలని ఇప్పుడు వచ్చినటువంటి Act లో ఉన్నది. ఆ విధంగా చేయవలసిన బాధ్యత మీపైన ఉన్నది. ఆ విషయంలో మీకు మద్దతు ఇస్తూ వుంటాను. మనము తెలుగును రాష్ట్ర భాషగా ఏర్పాటు చేసుకొంటున్నాము. కాబట్టి తెలుగుకు ప్రధాన స్థానం ఇవ్వక తప్పదని నా ఉద్దేశ్యము. రెండవ స్థానం ఉర్దూ భాషకు ఇవ్వలసి యుంటుంది. ఇక్కడ Muslims పెద్ద minority గా ఉన్నారు, కాబట్టి ఉర్దూ భాషకు ఇక్కడ ప్రధాన స్థానమున్నది. మూడవస్థానం ఇంగ్లీషు ఆక్రమించుకోవాలి. ఇంగ్లీషు 10, 15 ఏళ్ళలో పోయేటటువంటిది కాబట్టి, అది క్షీణ చంద్రునివంటిది. కనుక దానిపట్ల మనము ఎక్కువ శ్రద్ధ చూపనవసరం లేదు.

మీరు ఈ సభాధ్యక్ష స్థానాన్ని నాకు ఇచ్చి నన్ను గౌరవించినందుకు మీకు నా కృతజ్ఞత తెలియజేస్తున్నాను.